ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

మంగళవారం 24 సెప్టెంబరు 2024

అందరూ ఇష్టపడే నేత కామ్రేడ్ ఏచూరి

● సంస్మరణ సభలో సీఎం స్టాలిన్

పెరంబూర్, సెప్టెంబరు 23: భారత కమ్యూనిస్ట్ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) పార్టీ నేతలు, కార్యకర్తలే కాక అందరూ ఇష్టపడే నేతా కామ్రేడ్ సీతారాం ఏచూరి అని ముఖ్యమంత్రి స్టాలిన్ కొనియాడారు. స్థానిక తేనాంపేట సమీపంలోని కామరాజర్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో దివంగత సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్, ఏచూరి చిత్రపటం ఆవిష్కరించి నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎండీఎంకే అధ్యక్షులు వైగో, ద్రావిడర్ కళగం అధ్యక్షుడు వీరమణి, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, సీనియర్ పాత్రికేయులు ఎన్.రామ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్, డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్, సీపీఎం (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ఆశైతంబి, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అధ్యక్షులు ఖాజామొహిద్దీన్, సీపీఎం రాష్ట్ర నేతలు జి.రామకృష్ణన్, వాసుకి తదితరులు ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సభలో సీఎం స్టాలిన్ మాట్లాడుతూ, అనారోగ్యంతో ఏచూరి ఢిల్లీ ఆస్పత్రిలో చేరిన సమయంలో అమెరికా పర్యటనలో ఉన్న తాను ఆయన ఆరోగ్యంపై పార్టీ నేతలను అడిగి తెలుసుకున్నానన్నారు. ఆయన ఆరోగ్యంగా బయటకు వస్తారని ఆశించానని కానీ, ఆయన మృతిచెందారన్న వార్త తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. కలైంజర్ కరుణానిధి నేతృత్వంలో కోవైలో జరిగిన సెమ్మొళి మహానాడు, కలైంజర్ మరణానంతరం నిర్వహించిన ఆయన సంస్మరణ సభలో పాల్గొన్న ఏచూరి అమూల్యమైన సందేశం ఇచ్చారన్నారు. కలైంజర్, తాను అంటే ఏచూరికి ఎంతో అభిమానమన్నారు. ఎంతటి సమస్యలు చర్చించే సమయంలోనైనా ఆయన చిరునవ్వుతోనే ఉంటారని గుర్తుచేసుకున్నారు. జాతీయ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్న వ్యక్తిగా ఏచూరి ఉన్నారన్నారు. దేవగౌడ, ఐకే గుజ్రాల్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అధికారంలో ఉన్నా దాని వెనుక ఏచూరి పాత్ర ఎనలేనిదన్నారు. మతోన్మాద బీజేపీ శక్తులకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో 'ఇండియా' కూటమి ఏర్పాటుకు ఏచూరి ప్రధాన పాత్ర పోషించారని, ఆయన వ్యూహాలతోనే ఇండియా కూటమి గడచిన పార్లమెంటు ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధించిందన్నారు. పేదలు, కార్మికులు, రైతుల పక్షపాతిగా నిరంతరం వారి అభివృద్ధికి ఉద్యమాలు చేసిన ఏచూరి ఆశయాలు ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.





సీతారామ్ ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, వివిధ పార్టీల నేతలు - ఏచూరికి లాల్‌సలామ్ చేస్తున్న స్టాలిన్

రైల్వేస్టేషన్ల సమీపంలోని

టాస్మాక్ దుకాణాలు తొలగించాలి

● దక్షిణ రైల్వే విజ్ఞప్తి



రైల్వేస్టేషన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై మద్యం మత్తులో పడుకున్న వ్యక్తి

ప్యారీస్, సెప్టెంబరు 23: రాష్ట్రవ్యాప్తంగా రైల్వేస్టేషన్ల సమీపంలో ఉన్న 39 టాస్మాక్ మద్యం దుకాణాలను తొలగించాలని రాష్ట్రప్రభుత్వాన్ని దక్షిణ రైల్వే కోరింది. చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు సహా పలు జిల్లాలకు నడుపుతున్న రైలు ప్రయాణికుల వద్ద దోపిడీ, దాడి సంఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో రైళ్లు ఢీకొని ప్రజలు మరణించడంపై దక్షిణ రైల్వే తాజాగా ఓ సర్వే నిర్వహించింది. అందులో, వేలూరు, రాణిపేట, చెన్నై మార్గంలో ఉన్న రైల్వేస్టేషన్ల సమీపంలో 10 నుంచి 200 మీటర్ల దూరంలో ఉన్న టాస్మాక్ దుకాణాలే దోపిడీ, దాడులకు కారణమని తెలిసింది. ఈ ప్రాంతాల్లో ఉన్న టాస్మాక్ దుకాణాల్లో మద్యం సేవించి మత్తులో రైలుపట్టాలు దాటుతూ రైలు ఢీకొని పలువురు మరణించారని, మరికొందరు సంఘ విద్రోహులు ప్రయాణికులపై దాడులకు పాల్పడడంతో పాటు దోచుకుంటున్నట్లు తెలిసింది. మరికొందరు రైలు మార్గంలో ఉన్న సిగ్నల్స్ ధ్వంసం చేయడంతో పాటు విలువైన కాపర్ వైర్లు అపహరిస్తున్నట్లు సర్వేలో తెలిసింది. ఇలాంటి దుస్సంఘటనలు నివారించే దిశగా రైల్వేస్టేషన్ల సమీపంలోని టాస్మాక్ దుకాణాలు తొలగించేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని దక్షిణ రైల్వే విజ్ఞప్తి చేసింది.

పేలిన తూటా

➤ చెన్నైలో మరో ఎన్‌కౌంటర్

➤ నీలాంగరిలో సీజింగ్ రాజా పరారీయత్నం

➤ పోలీసు కాల్పుల్లో హతం

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నీలాంగరై ఇస్కాన్ సమీపంలో సోమవారం జరిగిన పోలీసుల ఎన్‌కౌంటర్‌లో పేరుమోసిన రౌడీ రాజా అలియాస్ సీజింగ్ రాజా (51) హతమయ్యాడు. బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య తర్వాత రాష్ట్రంలో రౌడీల వేట సాగుతోంది. ఆ నేపథ్యంలో నగరంలో సోమవారం ఉదయం నీలాంగరై వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో పేరుమోసిన రౌడీ రాజా హతమయ్యాడు. ఆమ్‌స్ట్రాంగ్ హత్య తర్వాత, గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌గా అరుణ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరిగిన మూడో ఎన్‌కౌంటర్ ఇది. తొలుత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో అరెస్టయిన రౌడీ తిరువేంగడం జూలై 15న పుళల్ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. కొద్ది రోజుల క్రితం ఉత్తరచెన్నై వాసులను గడగడలాడించిన కాక్కాతోప్పు బాలాజీ వ్యాసార్పాడి సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో ఇప్పటిదాకా 28 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో 25 మందిపై గూండాచట్టం కూడా ప్రయోగించారు. ఈ నేపథ్యంలో సీజింగ్ రాజా కూడా ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో 29వ నిందితుడని చెబుతూ పోలీసులు రెండున్నర నెలలుగా అతడి ఆచూకీ కోసం తీవ్రంగా గాలించారు. అతడిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేకదళాలను కూడా రంగంలోకి దింపారు. చివరకు ఆదివారం రాత్రి కడపలో దాగి ఉన్న సీజింగ్ రాజాను ప్రత్యేక దళం పోలీసులు అరెస్టు చేసి నగరానికి తీసుకువచ్చారు. నగరంలో ఓ రహస్య ప్రదేశంలో సీజింగ్ రాజాను పోలీసులు విచారణ జరిపారు. ఆ సందర్భంగా నీలాంగరై ఇస్కాన్ ఆలయం వెనుక మారణాయుధాలు దాచినట్లు రాజా తెలిపాడు. దీంతో ఆ ఆయుధాలను స్వాధీనం చేసుకునే నిమిత్తం వేళచ్చేరి సీఐ విమల్ నాయకత్వంలో పోలీసులు సోమవారం వేకువజామున అతడిని నీలాంగరైకి తీసుకెళ్లారు. చోళింగనల్లూరు నుంచి అక్కరై వెళ్లే దారిలో బకింగ్‌హామ్ కాలువ వద్ద కాలిబాట మార్గంలో ఉన్న ఇస్కాన్ ఆలయం వైపు పోలీసులు నడిపించుకెళ్లారు. ఇస్కాన్ ఆలయం వద్ద ఆయుధాలు దాచిన ప్రాంతాన్ని సీజింగ్ రాజా పోలీసులకు చూపెడుతూ హఠాత్తుగా అక్కడ దాచి ఉన్న తుపాకీ తీసి బెదరించాడు. అంతేకాకుండా పోలీసుల వైపు కాల్చాడు. పోలీసులు చాకచక్యంగా తప్పించుకోగా, తూటాలు పోలీసుల గస్తీ వాహనంలో దూసుకెళ్లాయి. పోలీసులు హెచ్చరించినప్పటికీ సీజింగ్ రాజా తుపాకీతో కాల్పులు కొనసాగించడంతో సీఐ విమల్ ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపారు. దీంతో సీజింగ్ రాజా శరీరంలోకి బుల్లెట్లు దూసుకెళ్లటంతో రక్తపు మడుగులో పడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం పక్కనే ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించాడని ధ్రువీకరించారు. ఆ తర్వాత సీజింగ్ రాజా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యతో సంబంధం లేదు...

ఇదిలా ఉండగా బీఎస్పీ రాష్ట్ర నాయకుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు రౌడీ రాజా అలియాస్ సీజింగ్ రాజాకు ఎలాంటి సంబంధాలు లేవని చెన్నై సౌత్‌జోన్ డిప్యూటీ కమిషనర్ సీబీ చక్రవర్తి తెలిపారు. మీడియాతో ఆయనమాట్లాడుతూ వేళచ్చేరిలో ఓ బార్ ఉద్యోగులను బెదరించిన కేసులో నిందితుడైన సీజింగ్ రాజా ఆచూకీ కోసం పోలీసులు గాలించారని, చివరకు ఆదివారం రాత్రి కడపలో దాగి ఉన్న అతడిని ప్రత్యేక దళం పోలీసులు అరెస్టు చేసి నగరానికి తీసుకువచ్చారని వివరించారు. రాజాపై ఆరుహత్య కేసులు సహా మొత్తం 39 కేసులు నమోదై ఉన్నాయనిచెప్పారు.



ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో పోలీసులు. ఇన్‌సెట్‌లో రౌడీ సీజింగ్ రాజా (ఫైల్‌ఫొటో)

ఎవరీ సీజింగ్ రాజా?...

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నరసింహన్, అంకమ్మ దంపతుల కుమారుడు రాజా చెన్నై ఈస్ట్ తాంబరంలో నివసించాడు. తొమ్మిదో తరగతి వరకు చదివి వాహనాలను సీజ్ చేయడం వంటి వి చేయడంతో ఇతడి పేరు పోలీసులు రికార్డుల్లో సీజింగ్ రాజాగా నమోదైంది. తొలుత తాంబరం మార్కెట్ ప్రాంతంలోని ఓ రౌడీతో రాజాకు పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత మామూళ్ల వసూలు చేయడం, కట్టపంచాయతీలు, దారిదోపిడీల వంటి నేరాలు చేసేవాడు. 2008 నుంచి ఇతడిపై హత్యకేసులున్నాయి. నగరంలోని పలు పోలీసుస్టేషన్లలో 35 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడుసార్లు గూండా చట్టం కింద అరెస్టయ్యాడు. పోలీసులు వెదుకుతుండడంతో సీజింగ్ రౌడీ తప్పించుకు తిరిగాడు. ఆంధ్రా లగ్జరీ కార్లు, ఫామ్‌హౌస్‌తో విలాసవంతమైన జీవితం గడిపాడు.

తంజావూరు, సేలంలలో మినీ టైడల్ పార్కులు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో తంజావూరు, సేలం జిల్లాల్లో కొత్తగా నిర్మించిన టైడల్ పార్కులను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం ప్రారంభించారు. రాష్ట్రంలో నగరాల నడుమ సమాచార సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తి కోసం తంజావూరు జిల్లా పిళ్లయార్‌పట్టి గ్రామంలో రూ.30.50 కోట్లతో, సేలం జిల్లా ఓమలూరు తాలూకా, ఆనైగౌండన్‌పట్టిలో రూ.29.50 కోట్లతో మినీ టైడల్ పార్కులు నిర్మించారు. ఈ రెండు పార్కులను చెన్నై సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రారంభించారు. పిళ్లయార్‌పట్టిలోని మినీ టైడర్ పార్కులోనే హేమీ బిజినెస్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఇన్ఫోరిస్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ఇండియా సంస్థల ప్రతినిధులకు స్థలం కేటాయిస్తూ స్టాలిన్ ఉత్తర్వులను అందజేశారు. ఇదే రీతిలో సేలం జిల్లా ఆనైగౌండన్‌పట్టిలో నిర్మించిన మినీ టైడల్ పార్కులో నమ్మ ఆఫీస్, ఏకేఏస్ హైటెక్ స్మార్ట్, తమిళ్ జోరియస్ ప్రైవేట్ లిమిటెడ్, టిల్ట్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, ఆక్సిస్ హెల్త్‌కేర్ సంస్థల ప్రతినిధులకు స్థలం, కార్యాలయ కేటాయింపు ఉత్తర్వులను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, టిడ్కో, టైడల్ పార్క్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ నందూరి తదితరులు పాల్గొన్నారు.





అగ్నిక్షేత్రంలో అపురూప ఘట్టం

తిరువణ్ణామలైలో కార్తీక దీపోత్సవాలకు అంకురార్పణ



తిరువణ్ణామలై ఆలయం వద్ద స్తంభ స్థాపన చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు, అధికారులు

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరమేశ్వరుడి అగ్నిక్షేత్రంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ కార్తీక మహాదీపోత్సవ శుభముహూర్త స్తంభస్థాపన కార్యక్రమం సోమవారం ఆలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగింది. తిరువణ్ణామలై ఆలయంలో డిసెంబర్ ఒకటిన దుర్గాదేవి ఉత్సవంతో కార్తీక మహాదీపోత్సవాలు ప్రారంభమవుతాయి. డిసెంబర్ 4న వేకువజాము అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం జరుగుతుంది. ఆ రోజు నుండి పది రోజులపాటు ఉదయం, రాత్రి పంచమూర్తులను మాడవీధుల్లో ఊరేగుతారు. డిసెంబర్ 13 వేకువజాము నాలుగు గంటలకు ఆలయంలో భరణిదీపం, సాయంత్రం 6 గంటలకు పర్వతశిఖరాగ్రం మహాదీపోత్సవం జరుగుతాయి. ఈ కార్తీక మహాదీపోత్సవ పూర్వాంగ కార్యక్రమాలు నిర్వహణ కోసం సోమవారం ఉదయం అరుణాచలేశ్వరాలయ సన్నిధిలోని సంబంధ వినాయకుడికి, శుభముహూర్త స్తంభానికి ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు నిర్వహించారు. ఆ తర్వాత ఆ ముహూర్త స్తంభాన్ని ఆలయ రాజగోపురం ముంగిట ఆలయ ప్రధానార్చకులు, అధికారులు నాటారు. ఈ యేడాది కార్తీక మహాదీపోత్సవానికి దేశవిదేశాల నుండి సుమారు 30 లక్షలమంది భక్తులు విచ్చేస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, భక్తులకు మెరుగైన సదుపాయాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తిరువణ్ణామలై కార్పొరేషన్ కూడా ఈ ఏర్పాట్లలో ప్రధాన పాత్రను పోషించనున్నదని ఆలయ అధికారులు చెప్పారు.

ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తుల పదవీ స్వీకారం

పెరంబూర్, సెప్టెంబరు 23: మద్రాసు హైకోర్టుకు కొత్తగా నియమితులైన ముగ్గురు అదనపు న్యాయమూర్తులు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.. కొత్త న్యాయమూర్తుల చేరికతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 65కు పెరిగింది. విల్లుపురం జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పూర్ణిమ, మద్రాసు హైకోర్టు చీఫ్ రిజిస్ట్రార్ జ్యోతిరామన్, మద్రాసు లేబర్ ట్రిబ్యునల్ న్యాయమూర్తి అగస్టీన్ దేవదాస్ మరియా క్లైట్ తదితరులు మద్రాసు హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు.

ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులే

బ్రాండ్ అంబాసిడర్లు

● మంత్రి ఉదయనిధి ● 114 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు




నిరుపేద కుటుంబానికి ఇంటి కేటాయింపు పత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఉదయనిధి

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందకునే లబ్ధిదారులే ప్రభుత్వ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్లని యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి అన్నారు. సోమవారం రాయపురం జోన్ కన్నప్పర్ దిడల్‌లో ఏర్పాటైన సభలో ఇళ్లులేని 114 మంది నిరుపేదలకు ఇళ్ల కేటాయింపు పత్రాలను ఆయన అందజేశారు. వీరందరికీ మూలకొత్తలం ప్రాజెక్టు స్థలం వద్ద ప్రభుత్వం కేటాయించింది. ఈ సభలో ఉదయనిధి మాట్లాడుతూ కన్నప్పర్ దిడల్‌లో 22 యేళ్లకుపైగా నిర్వాసితుల క్వార్టర్స్‌లో నివసించిన 114 మంది నిరుపేద కుటుంబాలకు ఇళ్లను కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ హామీ ఇచ్చారని, ఆ మేరకు యేడాదిలోపే ఆ పేద కుటుంబాలకోసం ప్రభుత్వం ఇళ్లను నిర్మించి వారి కేటాయింపు పత్రాలను కూడా అందించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. డీఎంకే ప్రభుత్వం మహిళాభ్యుదయానికి ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, లబ్ధిదారులు ఈ పథకాలపై విస్తృత ప్రచారం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామో అన్బరసన్, పీకే శేఖర్‌బాబు, ఎంపీ దయానిధి మారన్, శాసనసభ్యులు పరంధామన్, తాయగం కవి, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమారగురుబరన్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల సమీకరణపై

శ్వేతపత్రం

● ఈపీఎస్ డిమాండ్



ప్యారీస్, సెప్టెంబరు 23: నాలుగు పర్యాయాలు విదేశాల్లో పర్యటించి తక్కువ పెట్టుబడులు తెచ్చిన ముఖ్యమంత్రి స్టాలిన్ తక్షణం శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... 2021వ సంవత్సరం డీఎంకే ప్రభుత్వం అధికారం చేపట్టాక విదేశాల పెట్టుబడులను భారీగా రాబట్టినట్టు ప్రకటించిన సీఎం స్టాలిన్, ఈ 40 నెలల్లో నాలుగు సార్లు పెట్టుబడుల సమీకరణ పేరుతో కుటుంబ సభ్యులతో కలసి విదేశాల్లో పర్యటించారని, దేశంలో మిగతా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు తెచ్చిన పెట్టుబడుల కంటే అతి తక్కువగా పెట్టుబడులు సమీకరించినట్లు తెలుస్తోందని తెలిపారు. 2022 మార్చిలో కుటుంబంతో కలసి దుబాయ్ వెళ్లిన స్టాలిన్ సమీకరించిన పెట్టుబడులు రూ.6,100 కోట్లు, 2023 మే నెలలో సింగపూర్, జపాన్ పర్యటన సందర్భంగా సాధించిన పెట్టుబడులు రూ.3,233 కోట్లు, ఈ ఏడాది జనవరిలో స్పెయిన్‌లో పర్యటించి రూ.3,440 కోట్లు పెట్టుబడులు సమీకరించారని తెలిపారు. నాలుగు సార్లు విదేశీ పర్యటనలో డీఎంకే ప్రభుత్వం పెట్టుబడుల రూపంలో సాధించింది సుమారు రూ.18,000 కోట్లు మాత్రమేనని, డీఎంకే 40 నెలల ప్రభుత్వంలో సాధించిన విదేశీ పెట్టుబడుల పరిస్థితి, ప్రారంభించిన పరిశ్రమలు, కల్పించిన ఉద్యోగ అవకాశాలు, ఎందరు లబ్ధిపొందారు తదితర అన్ని వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని తాను మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఇదివరకే డిమాండ్ చేశానని తెలిపారు. అయితే, సీఎం పనితీరు సంతృప్తికరంగా లేనందువల్లే శ్వేతపత్రం విడుదల చేయకుండా జాప్యం చేస్తున్నారని, రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఎడప్పాడి తన ప్రకటనలో తెలిపారు.

సమాచార ధ్వని

నేటినుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

పెరంబూర్, సెప్టెంబరు 23: కార్పొరేషన్ పరిధిలోని తేనాంపేట, అడయార్ మండలాల్లో మంగళవారం నుంచి ఈ నెల 26వ తేది వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు తాగునీటి సరఫరా, మురుగునీటి బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... మందవెల్లి రామకృష్ణ మఠం రోడ్డులో తాగునీటి ప్రధాన పైప్ లైన్ అనుసంధాన పనులు చేపట్టనున్నారు. దీని కారణంగా తేనాంపేట మండల పరిధిలోని ట్రిప్లికేన్, రాయపేట, మైలాపూర్, నందనం, అభిరామపురం, మందవెల్లి, అడయార్ మండల పరిధిలోని రాజా అన్నామలైపురంలో కొళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుందని, ఆ ప్రాంత ప్రజలు నీటిని నిల్వచేసుకోవాలని సూచించింది. ఆయా సమయాల్లో లారీల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్లు, మరిన్ని వివరాలకు 044-45674567 అనే నెంబరు సంప్రదించవచ్చు.

రూ.85 కోట్లతో ఫుట్‌బాల్ మైదానం

పెరంబూర్, సెప్టెంబరు 23: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ షోలింగనల్లూర్‌లో రూ.85 కోట్లతో చేపట్టిన ఫుట్‌బాల్ మైదానం, రన్నింగ్ ట్రాక్ త్వరలో అందుబాటులోకి రానున్నాయి. 199వ వార్డులోని ప్రభుత్వ మహోన్నత పాఠశాల ప్రాంగణంలోని 6 ఎకరాల విస్తీర్ణంలో ఈ మైదానం, మైదానం వెలుపలి ప్రాంతంలో ఒకే సయమంలో 8 మంది రన్నింగ్ చేసేలా ట్రాక్ ఏర్పాటుకానున్నాయి. నిర్మాణపనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలో మైదానం, ట్రాక్ అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

పరిశోధన కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 23: చెన్నై ఐఐటీలో పీహెచ్‌డీ, ఎంఎస్ కోర్సుల్లో వచ్చే విద్యా సంవత్సరంలో 470 సీట్లు భర్తీకానున్నాయి. ఈ పరిశోధన కోర్సుల్లో చేరేందుకు అక్టోబరు 31వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. మరిన్ని వివరాలకు https://research.iitm.ac.in/ అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

యోగా, ప్రకృతి వైద్యకోర్సుల కౌన్సెలింగ్

పెరంబూర్, సెప్టెంబరు 23: పీజీ యోగా ప్రకృతి వైద్యకోర్సుల అడ్మిషన్ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు దివ్యాంగులు, క్రీడాకారులు, మాజీ సైనికుల వారసులు తదితర ప్రత్యేక విభాగాల కౌన్సెలింగ్ జరిగింది. మంళవారం జనరల్ విభాగం కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని యోగా, ప్రకృతి ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 160 సీట్లు, 16 స్వయంప్రతిపత్తి కళాశాలల్లో ప్రభుత్వ కోటాలో 960 సీట్లు, మేనేజ్‌మెంట్ కోటాలో 540 సీట్లుండగా, 3,414 మంది దరఖాస్తు చేసుకున్నారు. 26,27 తేదీల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు కౌన్సెలింగ్ జరుగుతుందని వైద్య విద్య డైరెక్టరేట్ తెలియజేసింది.

రెండో రోజు కొనసాగిన జాలర్ల సమ్మె

పెరంబూర్, సెప్టెంబరు 23: రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం జరుపుతున్న అమానుషదాడులు, అరెస్ట్‌లను నిరసిస్తూ పుంపుహార్ జాలర్లు చేపట్టిన సమ్మె సోమవారం రెండో రోజు కొనసాగింది. మైలాడుదురై జిల్లాకు చెందిన 37 మంది జాలర్లను అరెస్ట్ చేసిన లంక నావికాదళం సోమవారం మరో ఐదుగురిని అరెస్ట్ చేసింది. లంక నావికాదళం తీరును నిరసిస్తూ, ఆ దేశ జైళ్లలో ఉన్న రాష్ట్ర జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని జాలర్లు డిమాండ్ చేశారు. జాలర్ల సమ్మె కారణంగా సుమారు 600లకు పైగా పడవలు తీరానికే పరిమితమయ్యాయి.

సంతాన సాఫల్యం కోసం 25న ఉచిత వైద్యపరీక్షలు

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూరులోని శ్రీరామచంద్రా వైద్యకళాశాల ఆస్పత్రిలో సంతానం లేని దంపతులకు సంతాన సాఫల్యం కోసం ఈ నెల 25న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. 25 ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆసుపత్రి భవనం రెండో అంతస్థు జీ-బ్లాక్ లో ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో పాల్గొనేందుకు 044-45928544 అనే నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకుని ఇతర వివరాలను కూడా పొందవచ్చునని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 23: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

చిన్మయ నగర్: సాయి నగర్ క్వార్టర్స్, కాళియమ్మన్ ఆలయ వీధి, చిన్మయ నగర్, వెస్ట్ నటేశన్ నగర్, పచ్చయమ్మన్ ఆలయ వీధి, గంగైయమ్మన్ ఆలయ వీధి, ఇళంగో నగర్ క్వార్టర్స్, సాయిబాబా కాలని, రత్న నగర్, తారాచంద్ నగర్, ఎల్ అండ్ టి కాలని, సీఆర్ఆర్ పురం, సాయి నగర్, నటేశన్ నగర్, వినాయకం అవెన్యూ, కంబర్ వీధి, గాంధీ వీధి, రాఘవేంద్ర కాలని, వారియార్ వీధి, ఇందిరా నగర్, రాజీవ్‌గాంధీ వీధి, కన్నగి వీధి, గృహలక్ష్మి అపార్ట్‌మెంట్స్, సంజయ్ గాంధీ నగర్, వాయుపుత్ర వీధి, ఇళంగో నగర్ వెస్ట్, బాలాంబాళ్ నగర్, తాంగల్ వీధి, రెడ్డి వీధి కొంత భాగం, స్కూల్ వీధి, జైన్ అపార్ట్‌మెంట్స్, కృష్ణా నగర్ 4వ వీధి, బాలాజి నగర్, ఎస్బీఐ కాలని, పోస్టల్ ఆడిట్ కాలని, మేట్టుకుప్పం, భువనేశ్వరి నగర్

చేపాక్కం-ట్రిప్లికేన్: ట్రిప్లికేన్ హైరోడ్డు, వాలాజా రోడ్డు, ఎల్లీస్ రోడ్డు, ఎల్లీస్ పురం, అన్నాస్వామి వీధి, తయార్‌సాహిబ్ వీధి, బంగారు నాయకన్ వీధి, బాలముత్తు వీధి, చిన్నతంబి వీధి, ముక్తర్ నిషాబేగం వీధి, పచ్చయప్పన్ వీధి, నారాయణ నాయకన్ వీధి, బాబర్ ఖాన్ వీధి, వల్లభ అగ్రహారం వీధి, అప్పావు వీధి, టిప్పుసాహిబ్ వీధి, ఉన్నీస్ అలి వీధి, గులాంముత్తు వీధి, మేయర్ చిట్టిబాబు వీధి, కామరాజర్ రోడ్డు, నాగప్పన్ వీధి, దౌలత్తమ్మన్ వీధి, వెంకటాచలం వీధి, మసీదు వీధి, లాక్ నగర్


విల్లివాక్కం: సిడ్కో నగర్ 1 నుంచి 10 బ్లాక్‌లు, అమ్మన్ కుట్టై, నెహ్రూ నగర్, సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్, తిరునగర్, విల్లివాక్కం చుట్టుపక్కల ప్రాంతాలు, బాబా నగర్, రాజమంగళం మెయిన్ రోడ్డు, నార్త్, సౌత్ జగన్నాధన్ నగర్, సౌత్ హైకోర్టు కాలని.

జీరో పాయింట్‌కు చేరిన కృష్ణా జలాలు

పెరంబూర్, సెప్టెంబరు 23: ఆంధ్ర రాష్ట్రం కండలేరునుంచి ఈ నెల 19వ తేది నీటిని విడుదల చేశారు. కండలేరు నుంచి పూండి జలాశయం 177 కి.మీ దూరంలో ఉండగా, కృష్ణా జలాలు ప్రతిరోజు 25 కి.మీ వరకూ ప్రవహిస్తున్నాయి. ఆ ప్రకారం, రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన జీరో పాయింట్‌కు సోమవారంరాత్రి కృష్ణా జలాలుచేరాయి. అక్కడి నుంచి 25 కి.మీ దూరంలో ఉన్న పూండి జలాశయానికి మంగళవారం రాత్రి లేదా బుధవారం ఉదయం కృష్ణాజలాలు ప్రవేశించే అవకాశముందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

మహాబలిపురంలో వెనక్కి మళ్ళిన సముద్రం

● దర్శనమిచ్చిన మహిషాసురమర్ధిని గుహాలయం



మహిషాసురమర్ధిని గుహాలయం

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలోని ప్రపంచ ప్రసిద్ధి చెందిన చారిత్రక నగరం మహాబలిపురంలో సముద్రం వెనక్కిమళ్ళడంతో సముద్ర తీర దేవాలయం వద్దనున్న మహిషాసుర మర్ధిని గుహాలయం పూర్తిగా దర్శనమిచ్చింది. దీంతో స్థానికులు, పర్యాటకులు ఆలయంలోని దుర్గాదేవిని దర్శించేందుకు బారులు తీరారు. మహాబలిపురంలో పల్లవుల కాలం నాటి ప్రాచీన చిహ్నాల్లో సముద్రతీర ఆలయం అత్యంత ప్రాధాన్యమైంది. ఐదు దశాబ్దాల క్రితం సముద్రజలాలు రావటంతో సముద్రతీర దేవాలయం నీటమునిగింది. దీంతో పురావస్తు పరిశోధక విభాగం అధికారులు 1984లో ఆ ఆలయం చుట్టూ ప్రహరీలా పెద్ద పెద్ద బండరాళ్లను పేర్చారు. అదే చోట సముద్రతీర దేవాలయానికి ఉత్తరదిశగా పల్లవరాజులు చిన్న కొండలా ఉన్న బండరాయిలో నిర్మించిన మహిషాసురమర్ధిని గుహాలయం ఉంది. ఆ గుహాలయంలో దుర్గాదేవి శిల్పం కూడా ఉంది. మాసిమఖం రోజున సముద్రతీరంలో గిరిజనులు సముద్రపునీటిలో సగం వరకు మునిగి ఉండే ఈ ఆలయం చుట్టూ నిలిచి ప్రత్యేక పూజలు చేయటం ఆనవాయితీ. మాసిమఖం రోజున ఈ ఆలయం మూడడుగుల ఎత్తుమేర సముద్రజలాల్లో మునిగిఉంటుంది. సముద్రతీర దేవాలయానికి బండరాళ్లతో ప్రహారీ నిర్మించేటప్పుడు దాని వెనుకే ఉన్న ఈ గుహాలయంలో సముద్రజలాలు చొరబడకుండా ఉండేందుకు పురావస్తు అధికారులు ఎలాంటిచర్యలు చేపట్టలేదు. దీంతో ఈ గుహాలయంకొన్ని నెలలపాటు సముద్రజలాల్లో పూర్తిగా లేదా సగం వరకూ మునిగి ఉండటం, మరికొద్ది మాసాలు గుహాలయం పూర్తిగా కనిపించటం ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా ఆ ప్రాంతం వద్ద సముద్రం వెనక్కి మళ్లటంతో ఈ గుహాలయం పూర్తిగా బయల్పడింది. దీంతో స్థానికులు, పర్యాటకులు ఈ మహిషాసురమర్ధిని గుహాలయాన్ని సందర్శించడానికి బారులు తీరారు.

గిండి రేస్ కోర్స్ మైదానంలో గ్రీన్ పార్క్?



ప్యారీస్, సెప్టెంబరు 23: స్థానిక గిండిలో 118 ఎకరాల్లో ఉన్న రేస్ క్లబ్ మైదానం గ్రీన్ పార్క్‌గా అభివృద్ధి పరిచేందుకు తమిళనాడు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. 1945 ఏప్రిల్ 1 నుంచి 99 ఏళ్లకు రూ.4,832 కోట్ల విలువైన గిండి రేస్ క్లబ్ మైదానాన్ని ప్రభుత్వం లీజుకిచ్చింది. ప్రస్తుతం ఈ మైదానాన్ని ఇటీవల రాష్ట్ర ఉద్యానవన శాఖ కోర్టు ఉత్తర్వుల మేరకు స్వాధీనం చేసుకుంది. ఈ మైదానంలో పచ్చదనంతో కూడిన పార్క్, పర్యావరణ పరిరక్షణకు అవసరమైన వసతులు సమకూర్చేలా ప్రభుత్వం జీవో విడుదల చేసింది. వ్యాయామశాల, వినోదభరిత అంశాలతో రూపుదిద్దుకోనున్న ఈ పార్క్ ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్, సైక్లింగ్, చిన్నపిల్లల క్రీడల విభాగం తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. స్వచ్ఛమైన గాలి అందించి ఉష్ణోగ్రతలు క్రమబద్ధీకరించి, ఆరోగ్యకరమైన వాతావరణంతో కూడిన ఈ పార్క్‌ను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు.

తింభం ఘాట్‌లో లారీ బోల్తా

● స్తంభించిన ట్రాఫిక్



చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా తాళవాడి సమీపం తింభం ఘాట్‌రోడ్డులో సోమవారం ఉదయం కర్ణాటక నుంచి తిరుప్పూరుకు సరకుల లోడుతో వెళ్తున్న లారీ 15 మలుపు వద్ద బోల్తాపడింది. దీంతో ఘాట్‌రోడ్డు మీదుగా రాష్ట్రం నుండి కర్ణాటకకు వాహనాల రాకపోకలు రెండు గంటలకు పైగా స్తంభించాయి. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అగ్నిమాపక దళం ఆ ప్రాంతానికి జేసీబీ యంత్రాలతో వెళ్లి లారీని తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు.

సమస్యల సాధనకు దశలవారీగా ఆందోళనలు



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ఆర్గనైజర్ జనార్ధనన్

వేలూరు, సెప్టెంబరు 23: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య తీర్మానం చేసింది. ఆ సమాఖ్య జిల్లా స్థాయి సమావేశం ఉపాధ్యాయ హోంలో జరిగింది. ఈ సమావేశంలో 24 ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశానికి జిల్లా ఆర్గనైజర్ జనార్ధనన్, మహమ్మద్ షా నవాస్, జోసఫ్ అనన్యా అధ్యక్షత వహించగా, జాయింట్ సెక్రటరీ జయకుమార్ ఆహ్వానం పలికారు. సమావేశంలో గాంగేయనల్లూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు చేసిన రీల్స్‌కు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ నల్ల బాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని నిర్ణయించారు. అలాగే, జిల్లా విద్యాధికారిని కలుసుకొని సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో ఆర్గనైజర్లు జీడీ బాబు, రాజేష్‌ఖన్నా, శివవడివు, సెల్వకుమార్, జగదీశన్, కవిఅరసన్ సహా పలువురు పాల్గొనగా, కోశాధికారి గోపి వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

కరుంగాలిలో గిడ్డంగి ప్రారంభం



గిడ్డంగిని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 23: తమిళనాడు వినియోగవస్తువుల వాణిజ్య సంస్థ ఆధ్వర్యంలో ఆనైకట్టు నియోజకవర్గం కరుంగాలి గ్రామంలో రూ.402.52 కోట్లతో నిర్మించిన గిడ్డంగిని చెన్నై సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. గిడ్డంగి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ గిడ్డంగిలో 2 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వచేయవచ్చని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, ఆనైకట్టు యూనియన్ కమిటీ అధ్యక్షుడు భాస్కరన్, మండల మేనేజర్ జ్ఞానసభాపతి, కరుంగాలి పంచాయతి అధ్యక్షులు సుమిత, పొయిగై పంచాయతి ఉపాధ్యక్షులు కుమారపాండ్యన్ సహా పలువురు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

టి.నగర్ సత్య కేసులో 4 నెలల్లో చార్జిషీటు

● ఏసీబీకి హైకోర్టు ఆదేశం

అడయార్, సెప్టెంబరు 23: అన్నాడీఎంకేకు చెందిన టి.నగర్ మాజీ ఎమ్మెల్యే సత్యపై నమోదైన అవినీతి కేసులో నాలుగు నెలల్లో చార్జిషీటు దాఖలు చేయాలని ఏసీబీ అధికారులను మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. గతంలో కొళత్తూరుకు చెందిన న్యాయవాది సుబ్రమణియన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించింది. హైకోర్టు ఆదేశం మేరకు ఏసీబీ అధికారులు సత్యపై రెండు కేసులు నమోదు చేశారు. వాటిలో ఒకటి ఆదాయానికి మించి రూ.2.64 కోట్ల అక్రమాస్తుల కేసు, నియోజకవర్గ అభివృద్ధి పనుల పేరుతో రూ.35 లక్షల అవినీతికి పాల్పడిన కేసులు ఉన్నాయి. ఈ కేసుల్లో వచ్చే నాలుగు నెలల్లో చార్జిషీటును దాఖలు చేయాలని హైకోర్టు సోమవారం ఆదేశించింది.

టెక్నికల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 23: తమిళనాడు సిమెంట్ సంస్థ, వృత్తి నైపుణాభివృద్ధి సంస్థ సహా పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న మేనేజర్, డిప్యూటీ మేనేజర్ సహా 105 పోస్టులకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల 28వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు టీఎన్‌పీఎస్సీ విడుదల చేసిన ప్రకటనలో... ఈ పోస్టుల భర్తీకి నవంబరు 18వ తేది మొదటి పేపర్, 20వ తేది రెండవ పేపర్ పరీక్ష జరుగనుంది. మరిన్ని వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

పళని గిరిప్రదక్షిణ మార్గంలో ఆక్రమణల తొలగింపు

పెరంబూర్, సెప్టెంబరు 23: పళని గిరిప్రదక్షిణ మార్గాన్ని ఆక్రమించి నిర్మించిన దుకాణాలు తొలగించినట్లు రాష్ట్రప్రభుత్వం అఫిడవిట్ దాఖలుచేసింది. ఆక్రమణల తొలగింపుపై జిల్లా యంత్రాంగం హైకోర్టులో నివేదిక దాఖలుచేసింది. పళని ఆలయానికి చెందిన స్థలాలు, గిరి ప్రదక్షిణ మార్గంలో ఆక్రమణలు తొలగించాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యవహారంపై హైకోర్టు ఉత్తర్వులతో, జిల్లా యంత్రాంగం ఆక్రమణ దుకాణాలన్నింటినీ తొలగించినట్లు, ఈ ప్రాంతంలో వాణిజ్యపరమైన కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు చేపడతామని వ్యాపారులను హెచ్చరించినట్లు జిల్లా యంత్రాంగం హైకోర్టుకు తెలిపింది. ఈ వివరణ పరిగణలోకి తీసుకున్న హైకోర్టు, పిటిషన్ విచారణ ముగిసినట్లు ఉత్తర్వులు జారీచేసింది.

పట్టాల పక్కన భారీ గుంత

● సబర్బన్ రైళ్ళకు అంతరాయం



తిరువళ్లూరు రైల్వేస్టేషన్‌లో రైలు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

అడయార్, సెప్టెంబరు 23: నగర శివారు ప్రాంతమైన అన్ననూరు రైల్వే స్టేషన్‌కు సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన హఠాత్తుగా పెద్ద గొయ్యి ఏర్పడింది. గమనించిన రైల్వే సిబ్బంది ఆ మార్గంలో నడిచే సబర్బన్ రైళ్లను దూరప్రాంత రైళ్ళు నడిచే ప్రధాన ట్రాక్‌పైకి మళ్ళించారు. దీంతో ప్లాట్‌ఫామ్‌లు లేని పట్టాభిరాం, హిందూ కాలేజీ, అన్ననూర్ రైల్వేస్టేషన్లలో సబర్బన్ రైళ్ళు ఆగకుండా వెళ్ళాయి. దీని కారణంగా ఆయా స్టేషన్లలో విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సమాచారం తెలుసుకున్న రైల్వే సిబ్బంది హుటాహుటిన అక్కడికి వెళ్ళి ఆ గొయ్యిని పూడ్చారు. రైలు పట్టాల పక్కనే పెద్ద గుంత ఎలా ఏర్పడిందో రైల్వే సిబ్బందికి అంతుపట్టలేదు.

వైద్యశిబిరానికి స్పందన

వేలూరు, సెప్టెంబరు 23: స్థానిక ఫిల్టర్‌బెడ్ రోడ్డులో ఉన్న ఉపాధ్యాయుల హోంలో మెర్సీ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆస్మా, పెరాలసిస్, చర్మ వ్యాధులు, చక్కెర వ్యాధి తదితర పరిశోధనలు చేసిన వైద్యులు, సూచనలు అందజేశారు. శిబిరంలో డా.స్టీఫన్, డా.స్టీఫన్ రేనా తదితరులు పాల్గొని సుమారు 500 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి రూ.50,000 విలువైన మందులు, మాత్రలు అందజేశారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాట్పాడిలో రామ్‌రాజ్ కాటన్స్ షోరూం ప్రారంభం



షోరూం ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబరు 23: స్థానిక కాట్పాడి చిత్తూర్ బస్టాండ్ సమీపంలో రామ్‌రాజ్ కాటన్స్ కొత్త షోరూం ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేలూరు వీఐటీ యూనివర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ హాజరై షోరూం ప్రారంభించి, తొలి విక్రయాలు చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేషన్ 1వ మండల కమిటీ అధ్యక్షులు పుష్పలత, వేలూరు డార్లింగ్ హోటల్ రెసిడెన్సీ నిర్వాహక డైరెక్టర్ వెంకటసుబ్బు, వేలూరు శ్రీ లక్ష్మీ జ్యువెలర్స్ స్థాపకులు ముకుంద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, రామ్‌రాజ్ కాటన్స్ నిర్వాహక డైరెక్టర్ అరుణ్ ఈశ్వర్, జాయింట్ నిర్వాహ డైరెక్టర్ అశ్విన్‌లు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు నుంచి కుగ్రామాలకు మినీ బస్సులు



ప్యారీస్, సెప్టెంబరు 23: రాష్ట్రంలోని కుగ్రామాలకు మినీ బస్సు సేవలను డిసెంబరులో ప్రారంభించనున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సచివాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... నగర ప్రాంతాల్లో పరిచయం చేసిన మినీ బస్సు సేవలకు ప్రజాదరణ పెరుగుతోందని, ఈ నేపథ్యంలో వంద కుటుంబాలకు పైగా నివసించే గ్రామాలకు వచ్చే డిసెంబరు నుంచి మినీ బస్సులు పరిచయం చేయనున్నట్లు తెలిపింది. ఇందుకోసం రూట్ మ్యాప్ సవరించినట్లు వివరించింది. ప్రధాన రోడ్ల నుంచి 25 కి.మీ దూరంలో ఉన్న గ్రామాలకు ఇప్పటికే ప్రభుత్వ రవాణా సంస్థలు బస్సులు నడుపుతున్నాయని, ఈ సదుపాయం లేని 17 కి.మీ దూరంలో ఉన్న ప్రాంతాలకు మినీ బస్సులు నడపాల్సిందిగా పలు గ్రామాలకు చెందిన ప్రజలు ప్రభుత్వానికి విన్నవించుకున్నట్లు తెలిపింది. కొత్త మినీ బస్సు సేవలకు సంబంధించి విధివిధానాలు, బస్సు రూట్ల ఎంపికకు సంబంధించి రవాణా శాఖ, ఆర్టీఓ అధికారులు, పంచాయతి సర్పంచ్‌లు, జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులతో ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటుచేసింది. మూడు నెలలుగా ఈ కమిటీ కుగ్రామాలను పరిశీలించి స్థానికుల అభిప్రాయలు సేకరించింది. ఈ వివరాలతో తయారైన నివేదిక ఆధారంగా డిసెంబరు నాటికి 100 కుటుంబాలకు పైగా నివసిస్తున్న కుగ్రామాలకు మినీ బస్సు సేవలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

యువకుడి జంధ్యం తెంపిన దుండగులు

● కేంద్ర మంత్రి మురుగన్ పరామర్శ ● ఖండించిన పోలీసులు



యువకుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి మురుగన్

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి సమీపం పెరుమాళ్ ప్రాం తంలో నడచి వెళుతున్న ఓ యు వకుడి జంధ్యా న్ని కొంతమంది దుండగులు తెంపి అవమానించినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఆ యువకుడి ఇంటికి వెళ్ళి పరామర్శించారు. అయితే యువకుడి జంధ్యాన్ని తెంపిన సంఘటన అవాస్తమని పోలీసులు ఖండించారు. యువకుడు నడిచి వెళ్ళిన ప్రాంతంలోని సీసీ ఫుటేజీ దృశ్యాలన్నింటిని పరిశీలించిన మీదట అలాంటి సంఘటన జరిగిన దాఖలాలే లేవని పోలీసు అధికారులు ప్రకటన జారీ చేశారు.

లంకాధీశుడు ఎవరైనా స్నేహంతో మెలుగుతాం

అడయార్, సెప్టెంబరు 23: శ్రీలంక కొత్త అధ్యక్షుడు ఎవరైనప్పటికీ భారత్ మాత్రం స్నేహభావంతోనే మెలుగుతుందని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ అన్నారు. శ్రీలంక అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో దిసనాయకే విజయం సాధించిన విషయం తెల్సిందే. ఈ అంశంపై కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ సోమవారం తూత్తుక్కుడిలో మీడియాతో మాట్లాడుతూ, శ్రీలంక అధ్యక్షుడుగా ఎవరున్నా, కొత్తగా ఎవరు ఎన్నికైనా భారత్ మాత్రం ఎప్పటిలానే సుహృద్భావ వాతావరణంలో స్నేహసంబంధాలను కొనసాగిస్తుందన్నారు. అలాగే, శ్రీలంక నావికాదళం అరెస్టు చేసే తమిళ జాలర్లను విడిపించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

బిల్లులు పెండింగ్‌లో పెట్టడమే ఆయన పని

● గవర్నర్‌పై స్పీకర్ అప్పావు ధ్వజం



కామన్‌వెల్త్ పార్లమెంటరీ కమిటీ ప్రాంతీయ సమావేశంలో పాల్గొన్న స్పీకర్ అప్పావు

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లులను పెండింగ్‌లో ఉంచి గవర్నర్ ఆర్ఎన్ రవి కాలయాపన చేస్తున్నారని స్పీకర్ అప్పావు ధ్వజమెత్తారు. ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా నేతృత్వంలో కామన్‌వెల్త్ పార్లమెంటరీ కమిటీ ప్రాంతీయ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. శాసనసభలో ఆమోదించిన బిల్లులను ఎలాంటి కారణాలు తెలుపకుండానే గవర్నర్ పెండింగ్‌లో ఉంచుతున్నారని, లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి ఒకటి రెండు గంటల్లోగానే ఆమోదిస్తుండగా, గవర్నర్ రోజుల తరబడి బిల్లులను ఆమోదించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇలా శాసనసభలో ఆమోదించిన బిల్లులను యేళ్లతబడి పెండింగ్‌లో ఉంచితే తీవ్రంగా నష్టపోయేది ప్రజలేనన్న విషయాన్ని గవర్నర్ మరచిపోతున్నారన్నారు. అదేపనిగా గవర్నర్ బిల్లులను పెండింగ్‌లో ఉంచటం శాసనసభను, శాసనసభ్యులను అవమానించడమేనని స్పీకర్ అప్పావు ఆరోపించారు.

మదురైలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

పెరంబూర్, సెప్టెంబరు 23: రాష్ట్రంలో సోమవారం అత్యధికంగా మదురైలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే, కరూర్ పరమత్తి, నాగపట్టణంలలో తలా 39.4 డిగ్రీలు, ఈరోడ్, తూత్తుకుడి, తిరుచ్చిలో తలా 38.3 డిగ్రీలు, తంజావూరులో 37.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

16 కిలోల బంగారం కొనుగోలు

పెరంబూర్, సెప్టెంబరు 23: వివాహ సహాయ నిధి పథకాలకు రూ.48.13 కోట్ల విలువైన 16 కిలోల బంగారం కొనుగోలు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 4 వివాహ సహాయ పథకాలకు సంబంధించి 8 గ్రాములతో కూడిన 8,000 బంగారు నాణేలు కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

శ్రీవారిసేవలో..



జస్టిస్ వేలుమణి

తిరుమల వేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం చెన్నై హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. - తిరుమల

శివకాశిలో ముమ్మరంగా టపాసుల తయారీ

● పొరుగు రాష్ట్రాల ఆర్డర్లు తగ్గడంతో వ్యాపారుల ఆందోళన

పెరంబూర్, సెప్టెంబరు 23: దీపావళికి ఇంకా 40 రోజులే ఉన్న నేపథ్యంలో, శివకాశి ప్రాంతంలోని బాణసంచా కర్మాగారాల్లో టపాసుల తయారీ ముమ్మరంగా సాగుతోంది. అదే సమయంలో, పొరుగు రాష్ట్రాల నుంచి ఆర్డర్లు తగ్గడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విరుదునగర్ జిల్లా శివకాశి, చుట్టుపక్కల ప్రాంతాల్లో 1,070 బాణాసంచా కర్మాగారాలు పనిచేస్తున్నాయి. బేరియం నైట్రేట్ వినియోగం, రసాయన మిశ్రమాలతో తయారీపై నిషేధం విధించిన నేపథ్యంలో, 60 శాతం టపాసులు మాత్రమే తయారువుతున్నాయి. దేశంలో మొత్తం బాణసంచా అవసరాల్లో 95 శాతం శివకాశిలో ఉత్పత్తి అవుతున్నాయి. ఈ ప్రాంతంలో తయారయ్యే బాణాసంచా 10 శాతం రాష్ట్రంలోను, 90 శాతం పొరుగు రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటారు.

రాష్ట్రంలో రూ.450 కోట్ల వ్యాపారం...

గత ఏడాది దీపావళికి ఒక నెల ముందుగానే విక్రయాలు జోరుగా సాగాయి. తయారుచేసిన 95 శాతం టపాసులు విక్రయమయ్యాయి. రాష్ట్రంలో రూ.450 కోట్లు, దేశవ్యాప్తంగా రూ.6,000 కోట్ల మేర బాణాసంచా వ్యాపారం సాగింది. ఈ ఏడాది బాణసంచా కర్మాగారాల్లో సంభవిస్తున్న ప్రమాదాలు, లైసెన్స్ రద్దయిన బాణసంచా కర్మాగారాల్లో ఉత్పత్తి ప్రారంభించేందుకు అనుమతివ్వడంలో జాప్యం, చిన్న కర్మాగారాల కార్మికులు సమ్మె తదితర కారణాలతో బాణసంచా తయారీ మందగించింది. ప్రస్తుతం దీపావళికి 40 రోజులే ఉండడంతో కర్మాగారాల్లో టపాసుల తయారీ జోరుగా సాగుతోంది.

ఆడిపెరుక్కు రోజే విక్రయాలు ప్రారంభం...

శివకాశి ప్రాంతంలోని సుమారు 2,500 దుకాణాల్లో ఆడిపెరుక్కు రోజున పూజలు చేసి, దీపావళి విక్రయాలు ప్రారంభించారు. కానీ, పొరుగు రాష్ట్రాల నుంచి ఆశించిన స్థాయిలో ఆర్డర్లు రాకపోవడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లోని గోదాముల్లో బాణాసంచా పేలిన ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో, టపాసులు కొనుగోలు చేసి వాటిని నిల్వచేసేందుకు పొరుగు రాష్ట్రాల వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. మధ్యప్రదేశ్ రాష్ట్రం హర్దా జిల్లాలో గత ఫిబ్రవరిలో అనుమతులు లేని బాణసంచా కర్మాగారం, గోదాములో అగ్నిప్రమాదం సంభవించి 11 మంది మృతిచెందారు. పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్ జిల్లాలో ఈ నెలలో సంభవించిన పేలుడులో నలుగురు మృతిచెందారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఫిరోజ్‌బాద్ జిల్లాలో గత వారం బాణసంచా కర్మాగారం, గోదాములో అగ్నిప్రమాదం సంభవించిన ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు మృత్యువాతపడ్డారు. ఈ కారణాలతో, పొరుగు రాష్ట్రాల్లో బాణసంచా గోదాము, దుకాణాలకు పలు నిబంధనలు విధించడంతో పాటు పర్యవేక్షణ కూడా తీవ్రం చేశారు. అందువల్ల పొరుగు రాష్ట్రాల వ్యాపారుల నుంచి కొనుగోళ్ల మందకొడిగా ఉన్నాయి. ఏమైనా, విజయదశమి తర్వాత బాణసంచా విక్రయాలు ఊపందుకొనే అవకాశముందని ఉత్పత్తిదారులు, వ్యాపారులు ఆశాబావం వ్యక్తం చేస్తున్నారు.



టపాసులు తయారు చేస్తున్న కార్మికులు



'ఇడ్లీ కడై' ఫస్ట్‌లుక్



హేమ కమిటీ ఒక 'గేమ్ ఛేంజర్'

● సంయుక్తా మేనన్

చిత్రపరిశ్రమలో మహిళలపై సాగుతున్న లైంగిక వేధింపుల అంశంపై హేమ కమిటీ ఇచ్చిన నివేదిక ఇండస్ట్రీలో ఒక గేమ్ ఛేంజర్‌గా ఉంటుందని హీరోయిన్ సంయుక్తా మేనన్ అభిప్రాయపడ్డారు. ధనుష్ నటించిన 'వాత్తి' అనే చిత్రం ద్వారా కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ మలయాళీ భామ... చిత్రపరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ అంశంపై స్పందించారు. 'ప్రస్తుతం చిత్రపరిశ్రమలో అనేక విషయాలు జరుగున్నాయి. ముఖ్యంగా దట్టమైన అడవిలో చిక్కుకుని దారికోసం గాలిస్తున్నట్టుగా నేటి సినిమా ఉంది. దీన్ని ఒక అవకాశంగా తీసుకుని కొందరు మహిళల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. సినిమాలో మహిళలకు రక్షణ కావాలి. ఇందుకు మలయాళ చిత్రపరిశ్రమలో జరుగుతున్న క్యాస్టింగ్ కౌచ్ అంశంపై హేమ కమిషన్ ఇచ్చిన నివేదిక ఒక గేమ్ ఛేంజర్‌గా ఉంటుందని భావిస్తున్నాను' అని పేర్కొన్నారు.

ధనుష్ కొత్త చిత్రం పేరు 'ఇడ్లీ కడై'

కోలీవుడ్ అగ్రహీరోల్లో ఒకరైన ధనుష్ మరో కొత్త చిత్రానికి కమిట్ అయ్యారు. 'ఇడ్లీకడై' పేరుతో రూపొందే ఈ చిత్రానికి ఆయనే స్వీయ దర్శకత్వం వహిస్తూ, హీరోగా నటించనున్నారు. తాజాగా ఆయన దర్శకత్వం వహించిన 'రాయన్' చిత్రం ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. ఇది ధనుష్ 50వ చిత్రం. ప్రస్తుతం 'నిలావుక్కు ఎన్‌మేల్ ఎన్నడి కోపం' చిత్రాన్ని నిర్మిస్తుండగా, 52వ చిత్రంగా 'ఇడ్లీకడై' పేరుతో రూపొందించనున్నారు. ధనుష్ దర్శకత్వం వహించే నాలుగో చిత్రం కావడం గమనార్హం. జీవీ ప్రకాష్ సంగీతం అందించే ఈ చిత్రాన్ని డ్వాన్ పిక్చర్స్ పతాకం, వండర్ బార్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నిర్మాతలు ఆకాష్ భాస్కరన్, ధనుష్, ఇందులో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడించాల్సివుంది.

చిత్రజ్యోతి

ఆమె.. ఈమేనా?

గుర్తుపట్టలేనంతగా 'గరగాట్టమ్' హీరోయిన్



కనక

సీనియర్ నటి కనక అలనాటి ప్రముఖ నటీమణి దేవిక ముద్దుల కుమార్తె. 'కరకాట్టకారన్' చిత్రంలో కథానాయికగా నటించారు. అందులో ఆమె పాత్రకు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపుతో పాటు పేరుప్రఖ్యాతలు కూడా వచ్చాయి. ఆ తర్వాత 40కు పైగా చిత్రాల్లో నటించారు. 1999లో ఆమె చివరిసారిగా నటించిన 'విరలుకేత్త వీకమ్' అనే చిత్రంలో నటించారు. ఆ తర్వాత ఆమె వెండితెరపై కనిపించలేదు. ఈ నేపథ్యంలో చెన్నై నగరంలోని ఓ షాపింగ్ మాల్‌లో ఆమె కనిపించగా, ఓ సినిమా విలేఖరి ఆమెను గుర్తించి ఆమెతో ఫొటోలు దిగారు. అవి ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 1989లో చూసిన కనక, 2024లో చూసిన కనకకు ఏమాత్రం పోలిక లేదు. ఎవరూ గుర్తుపట్టలేనంతగా ఆమె మారిపోయారు. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు ఆమె.. ఈమేనా? అంటూ ప్రశ్నిస్తున్నారు.



శ్రీదివ్యను సన్మానిస్తున్న దృశ్యం

నటీనటులు సమాజ సేవకు అంకితంకావాలి

● మాజీ న్యాయమూర్తి జ్ఞానప్రకాశం

సినీ నటీనటులు సమాజసేవకు అంకితంకావాలని మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జ్ఞానప్రకాశం పిలుపునిచ్చారు. మహా ఫైన్ ఆర్ట్స్ (ఆర్ట్, సోషల్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్), యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సమాజానికి తమవంతుగా సేవలు అందించిన వెండితెర, బుల్లితెర కళాకారుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వడపళని, కుమరన్ కాలనీలో ఉన్న శిఖరం హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ న్యాయమూర్తి జ్ఞానప్రకాశం పాల్గొని సినీ, బుల్లి తెర నటీనటులను అభినందించారు. ఇందులో బెస్ట్ ఫిల్మ్ అవార్డు (స్పెషల్ అవార్డు)ను మహానా సంజీవి, బెస్ట్ ఫిల్మ్ నటి (స్పెషల్ అవార్డు) షర్వాణీ, ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ అవార్డును శ్రీదివ్య, బెస్ట్ న్యూఫేస్ అవార్డును సహానాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహా ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి డాక్టర్ అనురాధా జయరామన్, యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా కార్యదర్శి నెల్లై సౌందర్‌రాజన్, తమిళనాడు స్పోర్ట్స్‌మెన్ వెల్ఫేర్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఎంఆర్ సౌందర్‌రాజన్, సిగరం హాలు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుడి ఎక్కడుంటే ధర్మం అక్కడే

● అజంతా డా.కె.శంకరరావు



అజంతా శంకరరావు, టీఎన్ కుమార్‌లను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, సెప్టెంబరు 23: గుడి ఎక్కడుంటే ఆ ప్రాంతంలో ధర్మం వెల్లివిరుస్తుందని శ్రీ కన్యకా పరమేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ (ఎస్కేపీసీ) ఫౌండర్ చైర్మెన్ అజంతా.డా.కె.శంకరరావు పేర్కొన్నారు. ఎస్కేపీసీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏడాదికొక వాసవి ఆలయ నిర్మాణం అనే పథకాన్ని చేపట్టి మొదటిసారిగా అంబత్తూర్‌లో నిర్మించిన అమ్మవారి ఆలయానికి మహాకుంభాభిషేకం, మండల పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలు, ట్రస్ట్ కమిటీ సభ్యులు, వైశ్య ప్రముఖుల సత్కార సభ ఎస్కేపీసీ ట్రస్ట్ అవార్డ్స్ నైట్స్ పేరుతో ఆదివారం రాత్రి నగరంలో ఘనంగా నిర్వహించారు. సభాధ్యక్షుడు అజంతా శంకరరావు మాట్లాడుతూ... గుడి, బడి ఉన్న ప్రాంతంలో న్యాయం, ధర్మం వెల్లివిరిస్తుందని, ఆ సంకల్పంతోనే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులు తమ సంపాదనలో కొంత భాగాన్ని ఈ పథకానికి కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఏడాదికి ఒక వాసవాంబ ఆలయం అనే పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆలయాలు నిర్మించడమే తమ లక్ష్యమని, ఇందుకోసం సహకరిస్తున్న దాతలు, ట్రస్ట్ సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుంభాభిషేకం కమిటీ చైర్మెన్ డా.సేలం డి.రవిచంద్రన్, నిర్వాహకులు టీఎన్ కుమార్, పి.శేషాద్రి, సి.రంగనాథం చెట్టి, అపోలో వి.సుబ్రమణియన్, ఎం.ప్రవీణ్ కుమార్, డా.ప్రవీణ్ తెల్లాకుళం, కోట సుధాకర్, ఊటుకూరి శరత్ కుమార్, డి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొనగా, ఉప కార్యదర్శి ఇ.బాలాజి వందన సమర్పణ చేశారు. ప్రముఖుల ప్రసంగాలు, దాతలు, కమిటీ నిర్వాహకుల సత్కారం, కళాకారిణుల నృత్యప్రదర్శనతో ఈ వేడుకలు ఉత్సాహంగా సాగాయి.

పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

● ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేసిన సీఎం



చెన్నై సచివాలయంలో టీఎన్‌పీఎస్సీ ద్వారా అసిస్టెంట్ ఫారెస్ట్ రేంజర్ పోస్టులకు ఎంపికైన 9 మంది అభ్యర్థులకు నియామకపత్రాలు పంపిణీ చేసిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు

అడయార్, సెప్టెంబరు 23: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సహకార శాఖ, ఆహారం, పౌరసరఫరాల మంత్రిత్వ శాఖల కోసం నిర్మించిన భవన సముదాయాలను ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం ప్రారంభించారు. సచివాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన వర్చ్యువల్ విధానంలో ఈ భవనాలను ప్రజలకు అంకితం చేశారు. కోయంబత్తూరు జిల్లాలో రూ.4.66 కోట్లతో నిర్మించిన కలైంజర్ శతజయంతి స్మారక ఆహార సరకుల ప్రయోగశాల ప్రారంభించారు. అలాగే, దిండిగల్, తిరుచ్చి, వేలూరు జిల్లాల్లో రూ.17.4 కోట్లతో ధాన్యం గోడౌన్లను, రూ.36.25 లక్షలతో నిర్మించిన 58 ధాన్య సేకరణ కేంద్రాలు, సహకార శాఖ రూ.15.22 కోట్లతో చెన్నై సాలిగ్రామంలో తమిళనాడు సివిల్ సప్లై సెంటర్, చెన్నై పార్క్‌టౌన్‌లో సహకార హోల్ సేల్ విక్రయ కేంద్రం, ట్రిప్లికేణ్ సహకార కేంద్రాలు సీఎం ప్రారంభించిన వాటిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా సర్వీసులో ఉండగా మరణించిన 32 మంది ఉద్యోగుల వారసులకు, 78 మంది పార్ట్‌టైమ్ సిబ్బందికి శాశ్వత ఉద్యోగ నియామక పత్రాలను సీఎం అందజేశారు. అలాగే, తెన్‌కాశి, దిండిగల్, తంజావూరు, తిరువారూర్, నాగపట్టణం, మైలాడుదురై, పుదుక్కోట, కడలూరు జిల్లాల్లో రూ.62.50 లక్షల చొప్పున మొత్తం రూ36.25 కోట్లతో నిర్మించిన 56 ధాన్య సేకరణ కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, కేఆర్ పెరియకరుప్పన్, ఎస్.రఘుపతి, చక్రపాణి, అన్బిల్ మహేశ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, సహకార, ఆహార శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జే.రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

అవయవ మార్పిడి చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రులకు నిధులు

● మంత్రి ఎం.సుబ్రమణ్యం



అపోలో హాస్పిటల్ నిర్వాహకులకు అవార్డు అందిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

ప్యారీస్, సెప్టెంబరు 23: ప్రైవేటు ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి శస్త్రచికిత్స కోసం రాష్ట్రప్రభుత్వం రూ.25 లక్షలు అందిస్తోందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఓమందూర్ ఎస్టేట్ ప్రాంగణంలోని కలైవానర్ ఆడిటోరియంలో అవయవాలు దానం చేసిన కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం అభినందన సభ నిర్వహించింది. ఇందులో నగరంలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలో అగ్రగామిగా ఉన్న అపోలో హాస్పిటల్ నిర్వాహకులకు మంత్రి ఎం.సుబ్రమణ్యం అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుబ్రమణ్యం మాట్లాడుతూ... దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి 2008 సెప్టెంబరు 5వ తేది రాష్ట్రప్రభుత్వం తరఫున మెదడు నిర్జీవమైన వ్యక్తుల అవయవాలు దానం చేసే పథకానికి శ్రీకారం చుట్టారని, ఇందుకోసం 35 ప్రభుత్వాసుపత్రులకు లైసెన్స్ కూడా ఇచ్చినట్లు తెలిపారు. 13 ప్రభుత్వాసుపత్రుల్లో కిడ్నీ, కాలేయం, గుండె, ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా జరిగినట్లు తెలిపారు. 48 ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ వైద్యకళాశాలల్లో బ్రెయిన్‌డెడ్ కమిటీలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కమిటీల ద్వారా దానంగా పొందే అవయవాలను అవసరమైన వారికి అమర్చుతున్నట్లు మంత్రి తెలిపారు.



చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వంగా కలుసుకున్న టీవీఎస్ సంస్థ చైర్మన్ వేణుశీనివాసన్, ఆయన సతీమణి మల్లిక

బస్సు టిక్కెట్ల రిజర్వేషన్‌కు ప్రత్యేక యాప్, వెబ్‌సైట్



యాప్, వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న మంత్రి శివశంకర్

ప్యారీస్, సెప్టెంబరు 23: తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థ (టీఎన్ఎస్టీసీ)లో ఆధునికీకరించిన వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకొనే విధానం ప్రారంభమైంది. సచివాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి శివశంకర్ ఈ కొత్త సదుపాయాలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో భాగంగా, విధి నిర్వహణలో మృతిచెందిన ఎంటీసీకి చెందిన 14 మంది, టీఎన్ఎస్టీసీలో ముగ్గురు వారసులకు కారుణ్య ప్రాతిపదికన డ్రైవర్లు, కండక్టర్లుగా నియామక పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కొత్తగా ప్రారంభించిన యాప్, వెబ్‌సైట్ ద్వారా ప్రతిరోజు 2,600 బస్సుల్లోని 1.24 లక్షల సీట్లకు సులభంగా రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. ప్రజలు రిజర్వేషన్ కోసం wws.tnstc.in అనే వెబ్‌సైట్, TNSTC మొబైల్ యాప్ సంప్రదించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఈసీఐ బిషప్ ఎజ్రా సర్గుణం కన్నుమూత

● నేతల సంతాపం



బిషప్ ఎజ్రా సర్గుణం (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, సెప్టెంబరు 23: ఇవాంజిలికల్ చర్చ్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) బిషప్ ఎజ్రా సర్గుణం (86) వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా నగరంలో ఆదివారం కన్నుమూశారు. భారత సామాజిక న్యాయవ్యవస్థ అధ్యక్షులుగా, బిషప్‌గా వ్యవహరించిన ఎజ్రా సర్గుణం కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయనకు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించినా ఫలించక ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని కీల్పాక్కంలో ఉన్న బైబిల్ కళాశాల ప్రాంగణంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం సమీపంలో ఉన్న పనవిళై గ్రామానికి చెందిన సర్గుణంకు భార్య మంగళం, ఇద్దరు కుమార్తెలున్నారు. ఎజ్రా సర్గుణం దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్, డీఎండీకే అధ్యక్షుడు దివంగత విజయకాంత్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో తదితర పార్టీల నేతలతో సన్నితంగా ఉండేవారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో మూడు సార్లు రాష్ట్ర మైనార్టీ కమిటీ చైర్మెన్‌గా పనిచేశారు. ఎజ్రా సర్గుణం మృతికి ముఖ్యమంత్రి స్టాలిన్ సంతాపం ప్రకటించారు. క్రైస్తవులను మంచి మార్గంలో నడిపించే బిషప్‌గా, ద్రావిడ సిద్ధాంతాలు నమ్మి, మైనార్టీల సంక్షేమం కోసం ఎనలేని కృషిచేశారని సీఎం తన సంతాపంలో తెలిపారు. అదే విధంగా ద్రావిడర్ కళగం అధ్యక్షుడు కె.వీరమణి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ సహా క్రైస్తవ మతపెద్దలు, బిషప్‌లు, పాదర్లు కూడా సంతాపం తెలిపారు.



విద్యార్థి త్రినాథ్, గణిత శాస్త్ర టీచర్ గురుమూర్తులను సత్కరిస్తున్న ఎస్ఎల్ సుదర్శనం, ఓరుగంటి లీలారాణి

నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు శ్రద్ధచూపాలి

● సీనియర్ న్యాయవాది ఎస్ఎల్.సుదర్శనం

ప్యారీస్, సెప్టెంబరు 23: విద్యార్థులు చదువుతో పాటు నూతన ఆవిష్కరణలపై శ్రద్ధచూపి శాస్త్రవేత్తల స్థాయికి ఎదగాలని సీనియర్ న్యాయవాది, ఎస్కేపీడీ బాలుర పాఠశాలల కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం పిలుపునిచ్చారు. కేంద్ర శాస్త్రసాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఏటా జాతీయస్థాయిలో యువ ఆవిష్కరణల ప్రాజెక్ట్ నిర్వహిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో ఈనెల 17,18 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 350 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 31 మంది ఉత్తమ ఆవిష్కరణకర్తలుగా ఎంపికయ్యారు. వీరిలో రాష్ట్రం నుంచి చెన్నైలోని ఎస్కేపీడీ బాలుర మహోన్నత పాఠశాలలో ప్లస్ టూ చదువుతున్న పులగాల త్రినాథ్ ఎంపికయ్యాడు. రైళ్లలో సీనియర్ సిటిజన్‌ల కోసం కేటాయించే పై బెర్త్‌కు సులువుగా చేరుకొనేలా త్రినాథ్ రూపొందించిన ఆవిష్కరణ జాతీయస్థాయిలో 15వ స్థానం దక్కించుకుంది. అతడికి మార్గదర్శకత్వం, సాంకేతికపరమైన సలహాలిచ్చి ఈస్థాయికి తీసుకెళ్లిన పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఇ.గురుమూర్తులను సోమవారం పాఠశాల ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు ఓరుగంటి లీలారాణి, మాజీ కరస్పాండెంట్ మన్నారు ఉదయ్‌కుమార్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుక్కురల్ కంఠస్థ పోటీల్లో నారాయణ విద్యాసంస్థల ప్రతిభ

పెరంబూర్, సెప్టెంబరు 23: నారాయణ విద్యాసంస్థలు 'తిరుక్కురల్ కంఠస్త కార్యక్రమంలో పలు రికార్డులు సృష్టించాయి. 'నారాయణ వరల్డ్ రికార్డ్స్ ఫెస్టివల్ 2024' పేరిట ఆదివారం ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు 12 గంటలు నగరంలో 19 బ్రాంచ్‌లు, మదురైలో ఒక బ్రాంచ్ మొత్తం 20 ప్రాంతాల్లో ఒకేసారి ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 1 నుంచి 5వ తరగతి వరకు సుమారు 8,100 మంది విద్యార్థులు పాల్గొని, ఒక్కో విద్యార్థి నాలుగు నిమిషాల పాటు 50 పదాలు వల్లించారు. పదాలు, వ్యాఖ్యలు స్పష్టంగా ఉచ్చరించడం, ఆధ్యాత్మిక చింతన కల్పించడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎలైట్ వరల్డ్ రికార్డ్స్, ఏసియన్ రికార్డ్స్ అకాడమీ, ఇండియా రికార్డ్స్ అకాడమీ, తమిళన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థల ప్రతినిధులు పర్యవేక్షించి రికార్డ్‌గా నమోదుచేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు సర్టిఫికెట్లను నారాయణ పాఠశాల రామాపురం బ్రాంచ్ ప్రిన్సిపాల్ పి.సుమకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సాధన సర్టిఫికెట్లతో ప్రిన్సిపాల్ సుమ, ఉపాధ్యాయులు